సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 17 । మే । 2024



చీనీ టన్ను రూ.36,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500, కనిష్టం రూ.14 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధికి చెక్

క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గురువారం నుంచి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. 8లో



జిల్లావ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. వడగాల్పుల తీవ్రత కూడా తగ్గింది. గంటకు 6 నుంచి 10 కి.మీ.వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

22న అరుణాచలానికి ఆర్టీసీ బస్సు సర్వీసు



ధర్మవరం అర్బన్: పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన అరుణాచలం గిరి ప్రదర్శన, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 23న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదర్శన చేయాలనుకునే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానుపోను చార్జీలు రూ.1400 మాత్రమేనని తెలిపారు. బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో గాని, ఆన్‌లైన్‌లోగాని సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 6303151302, 9959225859 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి వేరుశనగకు రిజిస్ట్రేషన్



పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో సాగు చేయడానికి అవసరమైన సబ్సిడీ విత్తన వేరుశనగకు రైతులు శుక్రవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 2,44,763 హెక్టార్లు కాగా వేరుశనగ విస్తీర్ణం 1,74,910 హెక్టార్లు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకొనడానికి 1,00,443 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇందులో వేరుశనగ 97,886 క్వింటాళ్లు, కందులు 1500 క్వింటాళ్లు, రాగులు 300 క్వింటాళ్లు, పెసలు 200 క్వింటాళ్లు, ఉలవలు 300 క్వింటాళ్లు, అలసంద 100 క్వింటాళ్లు, కొర్ర 20 క్వింటాళ్లు, జీలుగ 138 క్వింటాళ్లు సరఫరా చేయడానికి అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. ఇవన్నీ 40 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయనున్నట్లు చెప్పారు.

ఎరువులు కూడా...

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా 14,875 టన్నులు, డీఏపీ 5969 టన్నులు, ఎంఓపీ 1151 టన్నులు, కాంప్లెక్స్ 1456 టన్నులు, ఎస్ఎస్‌పీ 2821 టన్నులు, మొత్తం 39,378 టన్నులు ఎరువుల సరఫరాకు ఏర్పాట్లు చేశామన్నారు.

క్వింటా చింతపండు రూ.16 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.16 వేలు ధర పలికింది. మార్కెట్‌కు గురువారం 1,200 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.11 వేల ప్రకారం ధర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.8,500, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. ఇక బోటు రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.3 వేలు, కనిష్టంగా రూ.2,500 ప్రకారం పలికింది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్ వ్యాప్తంగా దాదాపు 28 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా స్లీపర్, 3 ఏసీ కోచ్‌లను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గుత్తి జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న నర్సాపూర్–ధర్మవరం (17247/48) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, అదేవిధంగా గుంతకల్లు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న నర్సాపూర్–హుబ్లీ (17225/26) అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 21 వరకూ అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కాయ్ రాజా కాయ్

- శ్రీసత్యసాయి జిల్లాలో 7 ఎమ్మెల్యే స్థానాలకుగాను టీడీపీకి రెండు సీట్లు మాత్రమే వస్తాయని గోరంట్లలో ఆ పార్టీకే చెందిన ఒక నాయకుడు రూ.75 లక్షలు బెట్టింగ్ వేశాడు. మహిళలు ఎక్కువ శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారని, వారంతా జగన్‌కే ఓటు వేశారని ఆయన బహిరంగంగా చెబుతున్నాడు. ఎందుకిలా చెబుతున్నారని సొంత పార్టీ నాయకులు అడుగుతుంటే తాను బెట్టింగ్ వేసిన విషయం బయట పెట్టడంతో పాటు జూన్ 4న ఓటమిని తట్టుకోవడానికి మన పార్టీవారంతా 'సిద్ధం'గా ఉండాలని చెబుతున్నాడు.
- కదిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి ఎన్నికలకు మునుపు టీడీపీలో చేరిన ఓ నాయకుడు కదిరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మగ్బుల్ గెలుస్తాడని పందెం వేశాడు. ఈ విషయం టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌కు తెలిస్తే కోప్పడతాడని ముందే గ్రహించి ఎవరికీ అనుమానం రాకుండా వైఎస్సార్‌సీపీలో ఉన్న ఆయన బిజినెస్ పార్టనర్ చేతికి రూ.50 లక్షల డబ్బులిచ్చి ఆయన ద్వారా మగ్బుల్ గెలుస్తాడని బెట్టింగ్ కాశాడు.

- ఎన్నికల్లో గెలుపుపై కొందరు.. మెజార్టీపై మరికొందరు
- జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా బెట్టింగ్
- టీడీపీలో ఉంటూ వైఎస్సార్‌సీపీ పక్షాన కొందరు పందాలు



కదిరి: సార్వత్రిక ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. ఎట్టకేలకు ఈవీఎంలను కూడా స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. అయితే ఫలితాల కోసం జూన్ 4వ తేదీ ఎప్పుడొస్తుందా? అని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు జనం కూడా ఎదురు చూస్తున్నారు. ఇక ఇదే సమయంలో జిల్లా వ్యాప్తంగా ఈ పార్టీ .. ఆ పార్టీ అనే తేడా లేకుండా భారీగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. కోడి పందేలు, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ తరహాలో ఎన్నికల ఫలితాలు, మెజార్టీపై భారీగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. కొందరైతే 1కి మూడు రెట్ల పందెం కాస్తున్నారు. అంటే రూ. లక్షకు రూ.3 లక్షలు చొప్పున బెట్టింగ్‌లు వేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఫలానా పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? జిల్లాలో ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? ఫలానా మండలంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుంది. ఇలా పలు రకాలుగా బెట్టింగ్ జోరుగా సాగుతోంది.

ఆస్తులు తాకట్టు పెట్టిమరీ...

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కొందరు ఎన్నికల బెట్టింగ్‌లకు చేతిలో డబ్బు లేకపోయినా వారి ఆస్తులను తాకట్టు పెట్టి మరీ పందెం కాస్తున్నారు.

- కదిరి నియోజకవర్గం నల్లచెరువు మండల కేంద్రానికి చెందిన ఒక నాయకుడు తనకున్న ఆరెకరాల భూమిని బెట్టింగ్‌కు తాకట్టు పెట్టాడు. కదిరికి చెందిన మరో నాయకుడు తన కారును పందెంలో వేశాడు.
- పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలానికి చెందిన 8 మంది ఒక బృందంగా ఏర్పడి రూ.3 కోట్లకు పైగా బెట్టింగ్‌లు వేశారు.
- ధర్మవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటరామిరెడ్డికి జిల్లాలో అందరి కన్నా ఎక్కువ మెజార్టీ వస్తుందని ఒక పట్టు చీరల వ్యాపారి రూ.50 లక్షలు బెట్టింగ్ వేశాడు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్సార్‌సీపీకి ఎక్కువ సీట్లు వస్తాయని హిందూపురానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి బెంగుళూరులో తనకున్న అపార్ట్‌మెంట్‌ను బెట్టింగ్‌లో పెట్టాడు.
- మడకశిరలో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని అదే నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు బెంగుళూరుకు చెందిన ఒక బిల్డర్‌తో రూ.35 లక్షలు బెట్టింగ్ వేశాడు.
- హిందూపురంలో ప్రస్తుత ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణ ఓడిపోతాడని జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పందేలు వేశారు.

మహిళా ఓట్లే కీలకం..



పోలింగ్ రోజు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి మరీ ఓటు వేసి వెళ్లారు. బారులు తీరిన మహిళా ఓటర్లు ఎవరి పక్షం? అని టీడీపీ నేతలకు నిద్ర పట్టడం లేదని సొంత పార్టీ వారే అంటున్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎక్కడ బహిరంగ సభలు పెట్టినా, రోడ్‌షోలు చేసినా మహిళలే ఎక్కువ మంది పాల్గొన్నారు. సీఎం కూడా నిత్యం నా అక్క చెల్లెమ్మలు, నా అవ్వతాతలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అని అన్నారు. పేదలకు–పెత్తందార్లకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని సీఎంతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులందరి నోటా ఇదే మాట విన్పించింది. ఈ వర్గాలే ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనడంతో టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అందుకే జిల్లాలో ఎక్కువ మంది బెట్టింగ్ రాయుళ్లతో పాటు టీడీపీ శ్రేణులు కూడా వైఎస్సార్‌సీపీ వైపు పెద్ద మొత్తంలో బెట్టింగ్‌లు వేశారు.

అగ్ని ప్రమాదంలో రూ.20 కోట్ల ఆస్తి నష్టం

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న కియా అనుబంధ ఎస్ఎల్‌ఏపీ పరిశ్రమంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో రూ.20 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గురువారం కంపెనీ ముఖ్య ప్రతినిధులు ఎస్ఎల్‌ఏపీ పరిశ్రమకు చేరుకుని పరిశీలించారు. కియా కార్లకు సంబంధించిన హెడ్ లైట్లు, గ్లాసులు ఈ పరిశ్రమలో తయారవుతాయి. వెల్డింగ్ పనులు చేస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు ఎగిసిపడి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఘటనలో విలువైన యంత్రాలు కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ. 20 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు. కాగా, పరిశ్రమను ఆగమేఘాలపై పునరుద్ధరించి గురువారం నుంచి యథావిధిగా పనులు చేపట్టారు.

ఎంత పని'జేస్తి'వయ్యా!

పెద్దపప్పూరు: ఎన్నికల ముందు వరకు వచ్చేది తమ ప్రభుత్వమే అని మీసాలు మెలివేసిన జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెరగడం, మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలుస్తుందని తేలిపోవడంతో గ్రామాల్లో హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు తదితర గ్రామాల్లో పచ్చ మూకలు చేసిన రగడ అంతా ఇంతా కాదు. అంతటితో ఆగకుండా ఈ నెల 14న తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపైకి రాళ్లు, టపాసులతో వీరంతా దాడి చేశారు. ఈ అరాచక కాండకు ప్రధాన సూత్రధారి అయిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి.. పోలీసులు తనను ఎక్కడ అరెస్టు చేస్తారోననే భయంతో అనారోగ్యం నాటకమాడి హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో చేరాడు. దాడులకు తమను ఉసిగొల్పిన నేత ఒక్కసారిగా మాయమవడంతో మండలంలోని ఆ పార్టీ గూండాలు నేడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి కొండలు, గుట్టలు, పొలాల బాట పట్టి తమ బంధువుల ద్వారా అన్న పానీయాలను తెప్పించుకుంటూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిసింది.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



బిట్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం/లేపాక్షి/హిందూపురం టౌన్: జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఆయా స్ట్రాంగ్ రూములకు చేర్చి మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలోని బిట్ కళాశాల, లేపాక్షి చోళ సముద్రం వద్దనున్న డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూముల వద్ద ప్రస్తుత పరిస్థితులు, భద్రతా చర్యలు, విధులు నిర్వర్తిస్తున్న వారి పనితీరును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియను రెండు కేంద్రాల్లో చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను ఉంచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24 గంటల పాటు రక్షణగా ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చి, భద్రత వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులు, ఇతర పోలీస్, ఉద్యోగ సిబ్బంది ఆధ్వర్యంలో 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన తర్వాత సంబంధిత ఆర్ఓలకు కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరు కూడా అతిక్రమించకూడదన్నారు. కౌంటింగ్ సెంటర్‌ల ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా కౌంటింగ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న వారు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్‌శాఖ నేతృత్వంలో గట్టి బందోబస్తు చేపట్టాలని, చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకు కూడా అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూముల తనిఖీలో భాగంగా ఈవీఎం గదులను పరిశీలించి సంబంధిత అధికారులకు సీసీ కెమెరాల పనితీరు, పోలీసు పహారా, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తదితర అంశాలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన తర్వాత విజిటర్స్ రిజిస్టర్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు సంతకం చేశారు. కార్యక్రమంలో హిందూపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ, కదిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంశీకృష్ణ, ధర్మవరం రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి, మడకశిర రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్, హిందూపురం డీఎస్పీ కంజక్షన్, సీఐ ఈరన్న, పెనుకొండ తహసీల్దార్ ఉదయ శంకర్, చిలమత్తూర్ తహసీల్దార్ భాగ్యలత, మడకశిర తహసీల్దార్ వెంకటేష్, ఆర్ఐ అమర్, ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ అమిత్ బర్దర్ సస్పెన్షన్

- తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, అర్బన్ సీఐ మురళీకృష్ణపైనా వేటు
- పట్టణంలో హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం



ఎస్పీ అమిత్‌బర్దర్



డీఎస్పీ సీఎం గంగయ్య



సీఐ మురళీకృష్ణ



అల్లరి మూకలు రాళ్లు రువ్వుతున్నా ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు (ఫైల్)

అనంతపురం/తాడిపత్రి: ఎన్నికల సందర్భంగా జిల్లాలో చెలరేగిన అల్లర్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తీవ్రంగా స్పందించింది. ఎస్పీ అమిత్‌బర్దర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో పాటు ఆయనపై శాఖాపరమైన విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఎస్పీతో పాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, అర్బన్ సీఐ మురళీకృష్ణను కూడా ఈసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తాడిపత్రి పట్టణంలో పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు జరిగిన ఘర్షణలను అదుపు చేయడంలో వీరు విఫలమైనట్లు ఈసీ గుర్తించింది. ఘర్షణలను ముందే పసిగట్టి అరికట్టలేదనే నిర్ణయానికి వచ్చి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. అలాగే,తాడిపత్రి లో జరిగిన ఘటనలపై నమోదైన ప్రతి కేసుపై విచారించేందుకు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మొత్తం వ్యవహారంపై రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని పేర్కొంది.

సస్పెన్షన్ వేటు పడిన తొలి ఎస్పీ..

జిల్లా పోలీసు చరిత్రలో గతంలో ఎన్నడూ ఓ ఎస్పీ సస్పెండ్ కాలేదు. తొలిసారిగా అలా వేటు పడిన ఎస్పీ అమిత్ బర్దర్ కావడం గమనార్హం. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ అన్బురాజన్‌ను ఈసీ బదిలీ చేసింది. అనంతరం అమిత్ బర్దర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అనతి కాలంలోనే ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం.

ఫలితాల ప్రకటన తర్వాత భద్రత కల్పించండి

కాగా, ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత జిల్లా వ్యాప్తంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఈసీ దిశానిర్దేశం చేసింది. జూన్ 4న కౌంటింగ్ తరువాత తాడిపత్రిలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా నియంత్రించడానికి కేంద్ర బలగాల కంపెనీలను అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ బలగాలు హోం మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండేలా చూసుకోవాలని సూచించింది.

టీడీపీ నాయకుల వల్లే బలి..

ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన తనయుడు జేసీ అస్మిత్ రెడ్డి తాడిపత్రిలో కవ్వింపు చర్యలకు దిగారు. పచ్చ మూకలతో కలిసి ప్రశాంత పట్టణంలో హింస రాజేశారు. ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపైనే దాడికి యత్నించారు. ఈ క్రమంలోనే ఎస్పీ సస్పెండ్‌కు గురి కావడం గమనార్హం. గత నెల 5న ఎస్పీగా అమిత్ బర్దర్ బాధ్యతలు తీసుకున్నారు. టీడీపీ నాయకుల హింసాత్మక వైఖరి కారణంగా కేవలం 40 రోజుల్లోనే ఆయనపై సస్పెన్షన్ వేటు పడినట్లయింది.

అడిషనల్ ఎస్పీ రామకృష్ణపై చర్యలేవీ..?

కాగా, తాడిపత్రిలో హింసాత్మక ఘటనలకు పరోక్షంగా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ కారణమయ్యారని ఏకంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. ఆయన మద్దతుతోనే పచ్చ మూకలు రెచ్చిపోయారని కూడా విమర్శించారు. ఎన్నికల సంఘానికి ఆధార సహితంగా లేఖ కూడా రాశారు. అలాంటి ఏఎస్పీ రామకృష్ణపై మాత్రం ఈసీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

- సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగిన స్వామివారు





సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు, లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు పూజ చేస్తున్న అర్చకుడు

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం ఉదయం సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనానికి ఉభయదారులుగా గుద్దిటి నారాయణప్ప, బండ్లపల్లి వెంకటజయప్రకాష్, అంబటి సతీష్‌కుమార్, కట్టా భాగ్యమ్మ అండ్ సన్స్, అన్నం లక్ష్మీనారాయణ, మల్లికార్జున, నీలయ్యగారి ఫణికుమార్, షర్మిల, జింకా చిన్న కంబయ్య, కోటం కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుమారుడు కోటం రవీంద్రనాథ్ కుటుంబ సభ్యులు, సుందరేషన్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. చంద్రప్రభ వాహనానికి ఉభయదాతలుగా రామాయణం వెంకటేశ్వరప్రసాద్, కే.శే.గోపాల కృష్ణయ్య కుమారులు, గుద్దిటి నారాయణప్ప, సౌందర్యలహరి, పంచాంగం నరసాదత్తమూర్తి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వారికి ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు స్వాగతం పలికారు. వారిచేత స్వామికి పూజలు చేయించారు. సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాల ఊరేగింపుకు ఆలయ కమిటీ ఛైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు.

నేడు సర్వభూపాల, సింహ వాహనాల్లో...

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు సర్వభూపాల వాహనం, సాయంత్రం 6 గంటలకు సింహ వాహనంపై చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఊరంతా అప్పస్వాములే

- ఒకే ఊళ్లో 400 మందికి అదే పేరు
- కేక వేస్తే పది మంది పోగవుతారు

బత్తలపల్లి: ఏ పల్లెలోనైనా ఒకే పేరు ఉన్న వారు ఐదారు మంది ఉంటే గొప్ప. అలాంటిది ఆ ఊళ్లో నాలుగు వందల మందికిపైగా ఒకే పేరు పెట్టుకున్నారు. అప్పస్వామి అని కేక వేస్తే చాలు ఓ పది మంది పోగవుతారు. ఆరాధ్యదైవం నిత్యస్మరణ కోసం ఆయన పేరే పెట్టామని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంతకు ఆ గ్రామం ఏదంటే... శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గంటాపురం. గ్రామ జనాభా 3 వేలు కాగా, దాదాపు 440 మందికి పైగా అప్పస్వామి పేరు పెట్టుకున్నారు. ఇంత మంది ఒకే పేరు పెట్టుకోవడానికి కారణం ఏమని ఆరా తీస్తే.. ఆ గ్రామస్తులు ఓ పురాతన కథ వినిపిస్తున్నారు. ఆ కథ ఏమిటో తెలుసుకుందాం రండి...

నాలుగు శతాబ్దాలకు పూర్వం...

వైఎస్ఆర్ జిల్లా సింహాద్రిపురం మండలం గురజాల గ్రామానికి చెందిన అప్పస్వామి అనే వ్యక్తి దాదాపు నాలుగు వందల సంవత్సరాలకు ముందు గంటాపురం గ్రామం వచ్చి రాములస్వామి గుడి వద్ద కూర్చొన్నాడు. అప్పటికే గ్రామంలో కొన్ని వర్గాల మధ్య భూ తగాదా నడుస్తోంది. దీంతో ఇరు వర్గాలకు చెందిన దాదాపు 80 మందిని బళ్లారి పోలీసులు అదుపులోకి తీసుకుని వెళుతున్నారు. అయితే వీరికంటే ముందుగా బళ్లారి జైలులో అప్పస్వామి కూర్చొని కనిపించాడు. దీంతో గ్రామస్తులు ఆశ్చర్యపోయి 'ఎవరు నీవు? ఎందుకొచ్చావు?' అంటూ ప్రశ్నించారు. దీంతో అతను మీ కోసమే వచ్చానని చెప్పాడు. 'మీరంతా వెళ్లండి. మీ తరపున నేను



గంటాపురం ముఖచిత్రం



అప్పస్వామి మూలవిరాట్

జైలులో కూర్చుంటా'నంటూ తెలిపాడు. అయితే 'ఎలా వెళ్తాం? మమ్మల్ని ఎవరు వదులుతారు?' అని గ్రామస్తులు ప్రశ్నించారు. అప్పుడు ఆయన ఒక తత్వాన్ని ఆలపించారు. దీంతో లాకప్‌కు వేసిన తాళం దానంతటదే తెరుచుకుంది. పోలీసులు సైతం ఆశ్చర్యపోయి వారందరినీ వెనక్కు పంపారు. అప్పటి నుంచి గ్రామస్తులంతా అప్పస్వామిని మహిమాన్వితుడిగా భావించి ఆరాధించడం మొదలు పెట్టారు. అంతేకాక గ్రామంలో ఎలాంటి వివాదాలు లేకుండా అంతా అప్పస్వామి ఎలా చెబితే అలా నడుచుకోసాగారు. కొల్లాపురమ్మ దేవతకు పరమ భక్తుడైన అప్పస్వామి గ్రామంలోనే ఉంటూ ప్రజల కష్టాలు తీరుస్తూ వచ్చాడు. అప్పటి నుంచి గ్రామస్తులు తమ సంతానానికి (మగ పిల్లలకు) అప్పస్వామి పేరు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. 380 ఏళ్ల క్రితం ఆయన జీవసమాధి అయ్యారు. అనంతరం ఆయన పేరు మీద గ్రామంలో ఆలయం నిర్మించి, నిత్య పూజలు చేస్తున్నారు. ప్రతి శనివారం ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవం జరపడం ఆనవాయితీగా వస్తోంది.

ఆరిపోని దీపం...

గురజాల అప్పస్వామికి రాష్ట్రంలో పలు దేవాలయాలు ఉన్నాయి. చిత్తూరు, తిరుపతి, తాడిమర్రి మండలం ఎం.అగ్రహారం, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం గురజాల, కర్ణాటక ప్రాంతాల్లోనూ పలు ఆలయాలు నిర్మించారు. ఎం.అగ్రహారంలో మాజీ ఎంపీపీ పాటిల్ మిత్రమ్మ ఇంట్లో స్వామి ఆనాడు వెలిగించిన జ్యోతి నేటికీ ఆరకుండా వెలుగుతూనే ఉండడం మరో విశేషం. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు ఏటా ఇక్కడికి వచ్చి దివ్య జ్యోతిని దర్శించుకుని పూజలు చేస్తుంటారు.

కాలంతో పాటు పేరూ మారుతోంది..

గ్రామంలో ఇప్పటి వరకూ దాదాపు వంద మందికి పైగానే అప్పస్వాములున్నారు. అయితే ఇటీవల కుర్రకారు అప్పస్వామి అని పేరు పెట్టుకోవడం నామోషీగా భావిస్తున్నారు. దీంతో అప్పస్వామిలో 'అ' అనే అక్షరాన్ని మాత్రమే తీసుకుని అన్వేష్, అభిలాష్, అశోక్ లాంటి పేర్లను పెట్టుకుంటున్నారు.

తొలి పూజ అప్పస్వామికే



గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా, ఏదైనా కార్యక్రమం మొదలుపెట్టినా తొలుత అప్పస్వామికి పూజ చేసి, కొబ్బరి కాయ కొడతాం. అలా చేస్తే మాకు శుభం జరుగుతుంది. ఆయనంటే గ్రామస్తులకు అంత నమ్మకం.

– మంగళ అప్పస్వామి, గంటాపురం

తల్లిదండ్రుల పేర్ల ఆధారంగా...



నేను ఈ గ్రామంలోనే పుట్టాను. ఇక్కడే పెరిగాను. నా పేరూ అప్పస్వామే. గ్రామంలో అప్పస్వామి పేరుపై ఎవరికి ఉత్తరాలు వచ్చినా వారి తల్లిదండ్రుల పేరు ఆధారంగా కచ్చితమైన చిరునామాకే బట్వాడా చేస్తుంటా. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందీ లేదు.

– అప్పస్వామి, పోస్టుమాన్, గంటాపురం

అప్పస్వామంటే భక్తి



గ్రామంలో ప్రతి ఒక్కరికీ అప్పస్వామి అంటే భక్తి, నమ్మకం. ఎవరు ఏ పని మొదలుపెట్టాలనుకున్నా మొదట అప్పస్వామిని దర్శించుకుంటారు. ఆయన ఆశీస్సులతోనే పని ప్రారంభిస్తారు. వారి నమ్మకానికి తగ్గట్టే స్వామివారు గ్రామస్తులను చల్లగా చూస్తున్నారు.

– గోపాల్, అప్పస్వామి ఆలయ అర్చకుడు

క్లుప్తంగా

20 నుంచి 'దుర్గం'లో బ్రహ్మోత్సవాలు

- చకచకా సాగుతున్న ఏర్పాట్లు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ గోపురం

రాయదుర్గం: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ నరసింహారెడ్డి గురువారం తెలిపారు. 20న కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 21 న సింహ వాహనోత్సవం, 22న సూర్యప్రభ, 23న శేష వాహనం, 24న హనుమద్ వాహనం, 25న శ్రీవారి కల్యాణోత్సవం, 26న గజ వాహనం, 27న ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం, 28న అశ్వవాహనం, 29న వసంతోత్సవం, 30న శయనోత్సవ కార్యక్రమాలు ఉంటాయి.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి



మృతుడు పార్సీలాల్

పావగడ: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న మిఠాయి వ్యాపారి పార్సీలాల్ (30) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రాజస్తాన్‌కు చెందిన ఆయన 13 సంవత్సరాలుగా పావగడలో నివాసముంటూ మిఠాయి వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం మిఠాయి బండిలోని బ్యాటరీని ఛార్జింగ్ పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఈరలక్కప్ప

అమరాపురం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యున్నతి కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత తొలిసారి ఆయన అమరాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాల వారీగా పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. తనకు, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు. మహిళలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటు వేశారన్నారు. మడకశిరలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎంపీపీ ఈరన్న, సీనియర్ నాయకుడు పీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో గంగమ్మ ఆలయ నిర్మాణం



పూర్తి రాతితో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయం

పుట్టపర్తి రూరల్: ఓ విదేశీ వనిత ఆర్థిక సహకారం అందివ్వడంతో పుట్టపర్తిలో గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులు ఊపందుకున్నాయి. వివరాలు... సత్యసాయి బాబా దర్శనార్థం 20 ఏళ్ల క్రితం రష్యాకు చెందిన నజీరా పుట్టపర్తికి వచ్చారు. ఈ క్రమంలోనే పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో పలు హిందూ దేవాలయాలను ఆమె మరమ్మతులు చేయించారు. చిత్రావతి నది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయాన్ని సైతం పూర్తి స్థాయిలో ఆధునీకరించే పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ప్రత్యేక శిల్పులతో మాట్లాడి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. ఆళ్లగడ్డ నుంచి భారీ యంత్రాల సాయంతో రాతి దిమ్మెలు తెప్పించారు. గ్రామ దేవత గంగమ్మ ఆలయాన్ని విస్తరిస్తున్నారు. దేవుళ్ల ప్రతిమలు, శిల్ప తోరణాలు చెక్కుతున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రూ.1.50 కోట్లను ఆలయ నిర్మాణానికి ఆమె వెచ్చించారు. మరో రెండు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి కానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణకు టీకాలు వేయండి

రొళ్ల: క్షయ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయప్ప నాయక్, స్థానిక పీహెచ్‌ఎన్ సుధారాణి సూచించారు. రొళ్ల మండలంలోని ఏడు ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు చేపట్టిన క్షయ వ్యాక్సినేషన్ ప్రక్రియను గురువారం వారు పరిశీలించారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి టీకాలు వేయడం ద్వారా ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. క్షయ వ్యాధితో పాటు బీపీ, షుగర్ వంటి ఇతర దీర్ఘకాలిక రోగాలూ నియంత్రించవచ్చునన్నారు. 45 ఏళ్లు పైబడి 60 ఏళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్కరికీ టీకాలు తప్పనిసరిగా వేయాలని సూచించారు.

'సెబ్' అధికారి దందా

- టీడీపీకి తొత్తుగా మారిన ఓ ఇన్‌స్పెక్టర్
- మద్యం పట్టుబడినా కేసు నమోదు సున్నా
- మీడియాకు సమాధానం చెప్పకుండా దాటవేత
- గతంలో కుప్పంలో పని చేసినట్లు ఆరోపణలు



సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో ఓ సెబ్ అధికారి టీడీపీకి అమ్ముడుపోయారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం దొరికిందే అదునుగా లాలూచీ పడి ఎలాంటి కేసులు లేకుండా అనధికారికంగా మద్దతు తెలిపారు. ఫలితంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న ఓ నియోజకవర్గంలో కర్ణాటక మద్యం ఏరులై పారింది. అధికారి అండదండలతో టీడీపీ నాయకులూ రెచ్చిపోయారు. పోలింగ్ రోజున పీకల దాకా తాగి పలు చోట్ల గొడవలు చేశారు. మద్యం విక్రయాలపై కొందరు పక్కా సమాచారం ఇచ్చినా సదరు అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. అక్కడక్కడా నామమాత్రపు తనిఖీలు చేసి కేసుల్లేకుండా వదిలేసినట్లుగా పలు ఆరోపణలున్నాయి. అక్కడ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ మద్దతుదారుల ఇంటి వద్ద మద్యం పడేసినట్లుగా విచారణలో తేలడంతో కేసు నమోదు చేయలేదని సమాధానమిస్తూ ఉన్నతాధికారులను సైతం పక్కదారి పట్టించినట్లుగా సమాచారం.

చిత్తూరు వాసినంటూ రుబాబు..

తాను చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తినని.. కుప్పం పరిధిలో చాలా ఏళ్లుగా పని చేసినట్లు సదరు సెబ్ అధికారి చెబుతున్నారు. ఎన్నికలు పూర్తి కాగానే తిరిగి కుప్పం పరిధిలోకే వెళ్తానని, తాను ఎవరికీ భయపడేది లేదంటూనే టీడీపీ నాయకులు, కార్యకర్తల కొమ్ము కాస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సదరు అధికారి గురించి చర్చ మొదలైంది. కొత్తచెరువు మండలంలో టీడీపీ కార్యకర్తలు కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడితే ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దీనిపై ప్రశ్నించిన విలేకర్లపై బెదిరింపులకు దిగారు. 'మీ అంతు చూస్తా.. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. అధికారితో మాట్లాడడం తెలుసుకోండి. నా గురించి మీకు తెలీదు' అంటూ వివాదానికి తెరలేపారు. సదరు అధికారి తీరుపై అధికారులు విచారణ చేపడితే అక్రమాలు వెలుగు చూస్తాయని పలువురు అంటున్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధికి చెక్

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం
- 544 సచివాలయాల్లో ప్రతి గురువారం వ్యాక్సినేషన్



ఎనుములపల్లి సచివాలయంలో బీసీజీ టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్ మంజువాణి

ప్రశాంతి నిలయం: క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. 2025 నాటికి క్షయ నివారణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల్లో గురువారం నుంచి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు కలిగిన వారిని మినహాయించి 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలన్న లక్ష్యంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని 544 సచివాలయాల పరిధిలో వారంలో ప్రతి గురువారం వ్యాక్సినేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 5 లక్షల మందికి బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ చేయాలని అందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేశారు.

వ్యాక్సిన్ ఎవరు వేసుకోవాలి?

టీబీ బారిన పడే అవకాశం ఉన్న హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి మొదట అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ చేస్తారు. ప్రధానంగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీతో బాధపడుతున్న రోగుల కుటుంబ సభ్యులు, టీబీ చరిత్ర కలిగిన వారితో పాటు ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కిలోల కంటే తక్కువ కలిగిన వారికి వ్యాక్సిన్ వేస్తారు. 18 వయస్సు నిండిన వారిలో ఆసక్తి కలిగిన వారు కూడా వ్యాక్సిన్ పొందవచ్చు.

బీసీజీ టీకా ఎవరు వేసుకుంటే ప్రమాదం?

18 ఏళ్ల వయసు నిండిఒకొన్ని అనారోగ్య లక్షణాలు ఉన్న వారు అడల్ట్ బీసీజీ టీకా వేసుకోకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, టీబీ మందులు వాడుతున్న వారు, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ పేషెంట్లు ఈ టీకా వేసుకోకూడదని చెబుతున్నారు.

తొలిరోజే 13,219 మందికి టీకాలు..

జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లోని 544 సచివాలయాల పరిధిలో తొలి రోజు గురువారం అడల్ట్ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి సచివాలయంలో బీసీజీ టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 13,219 మందికి టీకాలు అందించినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి గురువారం అన్ని సచివాలయాల పరిధిలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఉంటుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు.

క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయం

కదిరి టౌన్: పట్టణంలోని సచివాలయాల్లో చేపట్టిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్‌రావు పరిశీలించారు. రెవెన్యూ కాలనీ, అడపాల వీధిలోని సచివాలయాలను పరిశీలించారు. మూడు నెలల్లో 12 విడతలుగా ఆయా సచివాలయాల్లో వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజుకి 70 మందికి వ్యాక్సిన్ వేయాలని, అలాగే ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. 2025 నాటికి క్షయ వ్యాధిని నివారించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్, ఎస్ఓ కళాధర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్



క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అడల్ట్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో ప్రతి గురువారం వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ పొందాలి. స్థానిక ఆశా వర్కర్ల ద్వారా సందేహాలు ఉంటే తెలుసుకోవాలన్నారు.

– డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ మంజువాణి

క్షయ నివారణే లక్ష్యం



క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అడల్ట్ బీసీజీ కార్యక్రమాన్ని చేపట్టింది. 18 ఏళ్లు నిండిన వారు టీకాను వేసుకోవచ్చు. ప్రధానంగా గతంలో టీబీ సోకిన వారు, టీబీతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు, 60 ఏళ్లు పూర్తయి హైరిస్క్ ఉన్న వారు తప్పని సరిగా వ్యాక్సిన్ తీసుకోవాలి.

– డాక్టర్ తిప్పయ్య, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: మండలంలోని కొటిపి గ్రామ సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: హిందూపురం–మలగూరు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. బూడిద రంగు నైట్ ప్యాంట్, కుడి చేతికి కాషాయ రంగు దారం ఉంది. రైలు దూసుకెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు.

భార్య వదిలి వెళ్లిందని వ్యక్తి బలవన్మరణం



మృతుడు నరసింహమూర్తి

రొద్దం: తనతో కాపురం చేయకుండా భార్య వదిలి వెళ్లడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం కంబాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహమూర్తి(35)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం క్రితం మనస్పర్థలు చెలరేగడంతో భార్య వదిలేసి వెళ్లింది. దీంతో నరసింహమూర్తి మానసికంగా కుదేలయ్యాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని తాళలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

హిందూపురం అర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్ వద్ద బుధవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని బోయపేటకు చెందిన శివకుమార్, సాయి, మారుతి బుధవారం సాయంత్రం చిన్నమార్కెట్ వద్ద గొడవపడ్డారు. ఘటనలో మారుతి గాయపడ్డాడు. అంతటితో ఆగకుండా బోయపేటకు శివకుమార్, సాయి చేరుకుని స్థానికులను దూషించడంతో ఆగ్రహించి వారిని నిర్బంధించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో శివ తప్పించుకున్నాడు. పట్టుబడిన సాయిని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. గురువారం ఉదయం బోయపేటకు చెందిన దాదాపు 50 మంది పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడంతో శివ, సాయిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, శివ, సాయి చేసిన ఫిర్యాదు మేరకు మారుతి వర్గంపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దు

రాయదుర్గం: వరి కొయ్యలు నాగలికి అడ్డు తగలకుండా రైతులు నిప్పు పెట్టి కాల్చేయడం వల్ల భూసారానికి ముప్పు పొంచి ఉందని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరిస్తున్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంటలు కోతకొచ్చాయి. ఈ క్రమంలో వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా వాటిని నేలలో కలియదున్నడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. దుక్కి దున్నే సమయంలో సూపర్‌ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలు అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఫలితంగా డీఏపీ వాడకం తగ్గుతుందన్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు విపరీతమైన వేడి కారణంగా భూమి సారం కోల్పోతుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషకాల శాతం పెరుగుతుందన్నారు.